క్లుప్తంగా

అన్నప్రాసన



భుజిరంపేట అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన చేస్తున్న మహిళలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖమర్ సుల్తాన ఆధ్వర్యంలో పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టగానే ముర్రుపాలు తాగించాలని చెప్పారు. ఆరునెలల తర్వాత అనుబంధ పోషకాహారం అందించాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సద్గుణ, లక్ష్మి, మహేశ్వరీ, ఏఎన్‌ఎం మధురి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపూర్ రేషన్‌షాపుల్లో ముక్కిన బియ్యం



రేషన్‌షాపులో ముక్కిన రేషన్ బియ్యం

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లోని రేషన్‌షాపుల్లో ముక్కిన బియ్యం వచ్చాయని వినియోగదారులు తెలిపారు. ఈనెల 1 నుంచి రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ ప్రారంభించగా, పలు గ్రామాల్లో ముక్కిన బియ్యం వచ్చాయని పేర్కొన్నారు. ఇబ్రహీంపూర్ గ్రామంలో నూకలతో కూడిన బియ్యం రావడంతో వాటిని ఎలా తింటారని ప్రజలు వాపోయారు. మండలంలోని 20కిపైగా గ్రామాల్లో ముక్కిపోయిన బియ్యం రావడంతో వండుకోవడానికి కూడా పనిరాకుండా ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్షీరాభిషేకం



మోదీ, మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారమైనందుకు బీజేపీ కార్యకర్తలు శనివారం మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లిలో ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రధాని కృషితోనే ఈసమస్య పరిష్కారమైందని వారు పేర్కొన్నారు. బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల శేఖర్, సీనియర్ నాయకులు వెల్మల సిద్ధరాంలు, శంకర్‌గౌడ్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అవినాశ్‌రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


విద్య ప్రమాణాలు మెరుగవ్వాలి: హెచ్‌ఎం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో విద్య ప్రమాణాలు మరింత మెరుగుపరిచి, జాతీయ సాధన సర్వేలో జిల్లాలోనే చిలప్‌చెడ్ మండలాన్ని ఉన్నత స్థాయిలో నిలపాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం హరిసింగ్, నోడల్ అధికారి విఠల్ అన్నారు. శనివారం వారు మండలంలోని చండూర్ ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు న్యాస్(జాతీయ సాధన సర్వే)లో భాగంగా భౌతిక, జీవశాస్త్రలలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా కార్యక్రమంలో చిలప్‌చెడ్ హెచ్‌ఎం వేదశ్రీ, శిక్షకులుగా ప్రభాకర్, ఫెబీలు నిర్వహించారు.

విద్యార్థుల ప్రతిభ పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రతిభను డైట్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు పరిశీలించారు. శనివారం ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన ఆయన విద్యార్థుల కనీస సామర్థ్యాలను పరిశీలించారు. హెచ్‌ఎం గాలయ్య, ఉపాధ్యాయులకు ఆయన సూచనలు చేశారు.

నీట్‌లో పేట విద్యార్థిని ప్రతిభ



జోడు నిహారిక

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన జోడు నిహారిక నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. శనివారం వెల్లడించిన రాష్ట్ర స్థాయి నీట్ ఫలితాల్లో 1,989 ర్యాంకు (560 మార్కులు) సాధించింది. పదో తరగతి వరకు స్థానిక మోడల్ స్కూల్‌లో, ఇంటర్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో చదివింది. ఈ సందర్భంగా ఆమెను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పచ్చదనంలో నిర్లక్ష్యం ఉండొద్దు

● మున్సిపల్ కమిషనర్ దేవేందర్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ దేవేందర్

రామాయంపేట(మెదక్): స్వచ్ఛదనం – పచ్చదనం విషయమై నిర్లక్ష్యం వహించొద్దని రామాయంపేట మున్సిపల్ కమిషనర్ దేవేందర్ ఆదేశించారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఐదు నుంచి తొమ్మిది వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఐదు రోజులపాటు నిర్వాహించాల్సి న కార్యక్రమాల విషయమై సమావేశంలో చర్చించారు. ముందు రోజు పట్టణంలో ర్యాలీ నిర్వహించాల్సి ఉంటుందని కమిషనర్ తెలిపారు. 12 వార్డుల్లో వార్డు అధికారులు, రిసోర్స్ పర్సన్లు కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వాటర్ ట్యాంక్‌లు శుభ్రపర్చడం, మొక్కలు నాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయాలి

● ఎంపీడీఓ శ్రీనివాస్



కౌడిపల్లిలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 5నుంచి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 5 రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో గ్రామస్తులు, స్వయం సహాయక సంఘాలు సభ్యులు, వాలంటీర్లు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొనేలా చేసి రోజువారి పనులను షెడ్యూల్ ప్రకారం విజయవంతం చేయాలని చెప్పారు. సంపూర్ణ పారిశుధ్యం, తాగునీరు, వర్షపునీటి సంరక్షణ, మురికి కాల్వలు శుభ్రం చేయడం, ఆరోగ్యం పరిశుభ్రత, వీధికుక్కల బెడద తీర్చాలన్నారు. ప్రభుత్వ సంస్థలు, బహిరంగ ప్రదేశాల శుభ్రతతోపాటు వనమహోత్సవంలో మొక్కలు నాటాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం, ఏపీఎం సంగమేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నీటి గుంత



ఏడుపాయల కమాన్ ఎదుట నీటి గుంత

పాపన్నపేట(మెదక్): తెలంగాణలోనే ప్రసిద్ధి గాంచిన ఏడుపాయల కమాన్ ఎదుట బ్రిడ్జి పూడికకు గురి కావడంతో వర్షపు నీరు మడుగులా మారుతోంది. మెదక్ – బొడ్మట్‌పల్లి రోడ్డు పక్కనే ప్రమాదకరంగా మారిన ఈ నీటి గుంతలో వాహన దారులు, పాదాచారులు, పిల్లలు ఎవరైన పడితే అంతే సంగతులు. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి పూడికకు గురైంది. రోడ్డుకు ఇరు పక్కలా డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు ఇలా ప్రవహించి మడుగులా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని లంబాడీల ఐక్య వేదిక మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంతోష్, నాయకులు శ్రీను, బాల్‌సింగ్, రవి, నరేష్ డిమాండ్ చేశారు.

ప్రజల భద్రతే ముఖ్యం: సీఐ



గుంతల్లో మొరం వేయిస్తున్న సీఐ రేణుకారెడ్డి

రేగోడ్(మెదక్): ప్రజల భద్రతే ముఖ్యమని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పోచారం రోడ్డుపై పడిన గుంతల్లో మొరం వేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోచారం నుంచి రాయిపల్లి వైపుగా ఉన్న రోడ్డుపై గుంతలు పడ్డాయని చెప్పారు. వచ్చిపోయే వాహనాదారులు ప్రమాదాల బారిన పడకూడదనే గుంతలను పూడ్చి వేయించామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజయ్య, హెడ్ కానిస్టేబుల్ రాచప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

పెద్దశంకరంపేట(మెదక్): రహదారి నిబంధనలపై ప్రతీ ఒక్కరికి అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ శంకర్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేషనల్ హైవే అథారిటీ శంకరంపేట ఆధ్వర్యంలో జాతీయ రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు రహదారులపై వెళ్లే సమయంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఎస్ మేనేజర్ ఖాజామోయినొద్దీన్, పీఆర్‌ఓ శివకుమార్, హెచ్‌ఎం విఠల్ తదితరులున్నారు.

నర్సరీకి మొక్కలు

సాక్షి ఎఫెక్ట్..

కొల్చారం(నర్సాపూర్): హరితం అస్తవ్యస్తం..! అనే వార్త సాక్షిలో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి, చర్యలు తీసుకున్నారు. మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో వన మహోత్సవం కోసం తెచ్చిన మొక్కలు నాటకుండా నిర్లక్ష్యంగా పడివేయడంపై శనివారం జిల్లా డీఆర్‌డీఓ శ్రీనివాసరావు స్పందించారు. నిర్లక్ష్యంగా పడేసిన మొక్కలను వెంటనే సంరక్షించాలని ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో మొక్కలను సంరక్షించేందుకు వాటిని గ్రామ నర్సరీకి చేర్చి చర్యలు తీసుకున్నారు.

'మాలల హక్కుల కోసం ఢిల్లీలో నిరసన చేపడతాం'

చిన్నశంకరంపేట(మెదక్): మాలల హక్కుల కోసం ఢిల్లీలో నిరసన చేపడతామని మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య అన్నారు. శనివారం నార్సింగిలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయనిపుణులతో చర్చించిన తర్వాత సర్వోన్నత న్యాయం స్థానం ఆశ్రయిస్తామన్నారు. ఈ నెల 8, 9, 10 మాలల హక్కుల సాధన కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరగనుందన్నారు. రిజర్వేషన్ ప్రక్రియను నిలిపివేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

నర్సాపూర్ ఎస్ఐగా లింగం



నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ ఎస్ఐగా శనివారం లింగం బాధ్యతలు స్వీకరించారు.

హైవే పక్కన వ్యర్థాల పారబోత



మహ్మద్‌నగర్ శివారు జాతీయ రహదారి పక్కన అటవీ ప్రాంతంలో పారబోసిన వ్యర్థాలు

కౌడిపల్లి(నర్సాపూర్): హైవే పక్కన అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థాలను పారబోశారు. దీంతో అక్కడ దుర్గంధంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. మండలంలోని మహ్మద్‌నగర్ పంచాయతీ శివారులోని నాగ్సాన్‌పల్లి పౌల్ట్రిఫాం సమీపంలో 765డి జాతీయ రహదారి పక్కన అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్, పేపర్, ఇతర వ్యర్థాలను గుర్తు తెలియని వ్యక్తులు పారబోశారు. దీంతో గాలికి వ్యర్థాలు రోడ్డుపైకి, వాహనదారులపై వచ్చిపడుతున్నారు.

బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు

జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు ఆయా గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు, పోషకాహారం చాలా అవసరమని అన్నారు. అనంతరం ఊరూరా ర్యాలీలు నిర్వహించారు.



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు



చేగుంట(తూప్రాన్): పొలంపల్లి గ్రామంలో..



నిజాంపేట(మెదక్): కల్వకుంటలో..



శివ్వంపేట(నర్సాపూర్): దొంతి అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం చేస్తున్న టీచర్లు

పాఠశాల ఎదుటే మురికి నీరు

అవస్థలు పడుతున్న విద్యార్థులు



పాఠశాల ఆవరణలో మురికి నీరు

అల్లాదుర్గం(మెదక్): మురికి నీటితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో మురికి నీరు ఉండటంతో అక్కడే భోజనాలు చేయాల్సి పరిస్థితి నెలకొంది. ఇది అప్పాజీపల్లి ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి. పాఠశాల ఆవరణలో మొరం మట్టి వేసిన మురికి నీటితో నిండిపోతుంది. పాఠశాల మూత్రశాలల నుంచి నీరు పారుతూ వరండాలో నిలిచిపోతుంది. మురికి నీరని తెలిసిన అక్కడే వరండాలోనే విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు. వరండా ఎదుట మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎస్ఐగా రాజు బాధ్యతలు స్వీకరణ**

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఎస్ఐగా శనివారం రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ నవత ఎస్పీ కార్యాలయం బదిలీ కావడంతో కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట ఎస్ఐ రాజు బదిలీపై వచ్చారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, విఘాతం కలిగించేవారిని ఉపేక్షించేదిలేదన్నారు. నేరాలకు పాల్పడినా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడేవారిపై చట్టపరంగా శిక్షిస్తామన్నారు. ఎక్కడైనా అసాంఘీక కార్యక్రమాలు జరిగినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

◆ **నీటి ఎద్దడి నివారణకు చర్యలు**

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు తనవంతు కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొంతన్‌పల్లి ఉన్నత పాఠశాలలో తన సొంత నిధులతో నూతన పంపుసెట్ ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. పాఠశాలల్లో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

◆ **పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

శివ్వంపేట(నర్సాపూర్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా అన్నారు. మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కృష్ణారావు జన్మదినం సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఆట వస్తువుల కోసం రూ.10 వేల నగదు అందజేయడంతో పాటు పీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మొక్కలు నాటారు. అనంతరం మగ్దుంపూర్ అనాథ ఆశ్రమంలోని పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, బాబురావ్, సురేందర్‌రెడ్డి, కృష్ణ, వేణు కుమార్, జయంత్, గోపాల్, తదితరులు ఉన్నారు.

◆ **20వ వరకు ఇంటర్ అడ్మిషన్లు**

కౌడిపల్లి(నర్సాపూర్): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఈనెల 20 వరకు అడ్మిషన్లు జరుగుతాయని కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్, తెలుగు మీడియం అందుబాటులో ఉందన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. శనివారం నార్సింగి మండలం కాస్లాపూర్ గ్రామానికి చెందిన శంకర్, సిద్ధిరాములు, మల్లేశంలకు రూ. 75 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేశ్, సత్యనారాయణ, స్వామి, సుధాకర్, చందు పాల్గొన్నారు.

◆ **చాకరిమెట్లలో విశేష పూజలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు.

◆ **సన్మానం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ ఎస్ఐగా విధులు నిర్వహించిన షేక్ మహబూబ్‌ను శనివారం స్టేషన్ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐలు నర్సింలు, సుధారాణి మాట్లాడారు. సిబ్బంది చెన్నుస్వామి, చైతన్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **ప్లేట్లు, గ్లాసులు పంపిణీ**

హవేళిఘణాపూర్(మెదక్): మండలంలోని మద్దుల్‌వాయి పాఠశాలలో మెదక్ పట్టణం అన్నపూర్ణ మెడికల్ షాపు సౌజన్యంతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

◆ **నివాళి**

నర్సాపూర్ రూరల్: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ తొంట వెంకటేష్ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, పార్టీల నాయకులు, పట్టణవాసులు అంతిమ యాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

◆ **విద్యార్థులతో బోనాల పండుగ**

నిజాంపేట(మెదక్): మండలంలోని నగరం గ్రామంలో శనివారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులతో అమ్మవారి వేషధారణ వేయించి నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు వెంకటేశ్, కల్పన, పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

◆ **నాణ్యతలేని బల్బులు ఎందుకు?**

కౌడిపల్లి(నర్సాపూర్): వీధిదీపాలకు నాణ్యతలేని బల్బులు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని కంచన్‌పల్లిలో వీధిదీపాలకు ఎల్ఈడీ బల్బులు బిగిస్తున్నారు. కాగా వాటిని పట్టుకుంటే సొట్ట పడటంతో పాటు రెండుగా విడిపోతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు స్పందించి నాణ్యమైన బల్బులు ఏర్పాటు చేయాలని కోరారు.

◆ **సద్వినియోగం చేసుకోవాలి**

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం దాతలు అందిస్తున్న సహాయం సద్వినియోగం చేసుకోవాలని చిన్నగొట్టిముక్కల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇందుమతి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సురేశ్ అన్నారు. శనివారం చిన్నగొట్టిముక్కల పీఎస్ పాఠశాల విద్యార్థులకు జాగృతి ఫౌండేషన్- లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో షూస్ అందజేశారు. జాగృతి ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని శేరితండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఏఎన్‌ఎంలు రాజమణి, మజీదబేగం గర్భిణులు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవసరం ఉన్నవారికి రోగనిరోధక టీకాలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, అనూష తదితరులు పాల్గొన్నారు.

◆ **బదిలీలు సహజమే**

చిలప్‌చెడ్(నర్సపూర్): ఏ ప్రభుత్వ ఉద్యోగికైన బదిలీ సమాజమేనని అంతారం గ్రామ మాజీ సర్పంచ్ ఆశోక్‌గౌడ్ అన్నారు. శనివారం చిలప్‌చెడ్ మండలం అంతారం గ్రామంలో కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన రవిశంకర్‌రెడ్డి బదిలీ అయ్యారు. దీంతో అతడిని, మాజీ సర్పంచ్, గ్రామస్తులు సన్మానించారు.

◆ **ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణారెడ్డి**

చేగుంట(తూప్రాన్): ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణారెడ్డి బాధ్యతలను స్వీకరించారు. బదిలీపై చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాధ్యతలను స్వీకరించారు.


◆ **మెదక్ జిల్లాను చార్మినార్‌లో జోన్‌లో కలపండి:ఉద్యోగులు**

నర్సాపూర్ రూరల్: మెదక్ జిల్లాలో చార్మినార్ జోన్‌లో కలపాలని కోరుతూ శనివారం నర్సాపూర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి ఉపాధ్యాయ, రెవెన్యూ, ఇతర శాఖల ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు నాగరాజ్, ప్రసన్నకుమార్, స్వామి, మన్నాలి, కవిత, దీపిక, సహదేవ్, ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థుల అభ్యున్నతికి కృషి**

పెద్దశంకరంపేట(మెదక్): కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని మండల నోడల్ అధికారి వెంకటేశం అన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విఠల్ తదితరులున్నారు.

◆ **యువకుడు అదృశ్యం**



వెంకటేశ్వరరావు

మనోహరాబాద్(తూప్రాన్): కొబ్బరికాయలు అమ్మడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శనివారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ గోదావరికి చెందిన కోడూరి వెంకటేశ్వరరావు గత నెల 30న రోజు వారీగా తూప్రాన్ దుకాణాకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తన ఆచూకీ లభించలేదు. దీంతో అతని తమ్ముడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **విద్యార్థుల నాణ్యమైన విద్యను బోధించాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన చేయాలని మండల నోడల్ అధికారి బాలరాజు తెలిపారు. శనివారం కౌడిపల్లిలో మండలంలోని వివిధ పాఠశాలలో సాంఘీకశాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు న్యాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలందుకు ఏగ్రేడ్ వచ్చేలా చూడాలని తెలిపారు. అనంతరం రిసోర్స్‌పర్సన్ జగదీష్, రాజేశ్వరీ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు లలితాదేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు**

నిజాంపేట(మెదక్): మండలంలోని ఖాసీంపూర్ గ్రామంలో ఒక రైతుకు విద్యుత్ షాక్‌తో తీవ్రగాయాలయ్యాయి. శనివారం ఖాసీంపూర్ తండాకు చెందిన ధరావత్ శంకర్ తన వ్యవసాయ పొలంలోని బోర్ మోటార్ నడవకపోవడంతో అక్కడి వెళ్లి పరిశీలించారు. బోర్ మోటారు వద్ద కరెంట్ లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ వేస్తున్న క్రమంలో అతని షాక్ తగిలి అక్కడే పడ్డాడు. దీంతో అతనికి తీవ్రగాయలయ్యాయి.

◆ **ఎల్‌ఓసీల పంపిణీ**

కౌడిపల్లి(నర్సాపూర్): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు శనివారం టీపీసీసీ కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి రూ. 10.75లక్షల ఎల్‌ఓసీలు అందించారు. మండలంలోని ముత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన గోపాల్, కొట్టాల గ్రామానికి చెందిన శ్రీనివాస్, కొల్చారం మండలం రంగంపేట గ్రామానికి చెందిన స్వప్న మూడు కుటుంబాలకు ఆవుల రాజిరెడ్డి ఎల్‌ఓసీలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రం కృష్ణాగౌడ్, ధన్‌సింగ్, రమేష్, అశోక్, శ్రీనివాస్‌నాయక్, శేఖులు, మహేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.